క్లుప్తంగా

మల్లయ్య మృతి పార్టీకి తీరని లోటు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

పీసీపల్లి,(కనిగిరి రూరల్): అత్యాల మల్లయ్య మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పీసీపల్లి మండలం వెంగళాయ పల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు అత్యాల మల్లయ్య(64) భౌతికకాయానికి మంగళవారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ నివాళులర్పించి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్యాల జఫన్య, జెడ్పీటీసీ ఓకేరెడ్డి, జి.బొర్రారెడ్డి, పోలు జయరాం రెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి, శీలం సుదర్శన్, ఎం కొండయ్య, హజరత్, ఏరువ నర్శింహా చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వరికూటి


సజ్జల రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లి కార్యాలయంలో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల గురించి వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, సింగరాయకొండ వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, యన్నాబత్తిన చిన్నా, గుండపరెడ్డి శ్రీహరిరెడ్డి, నల్లూరి సురేంద్ర తదితరులు ఉన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన డాక్టర్ బత్తుల


విజయసాయిరెడ్డితో డాక్టర్ అశోక్‌రెడ్డి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని మంగళవారం తాడేపల్లిలో ఆ పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వైద్య విభాగం తరపున సేవా కార్యక్రమాలు చేపట్టి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని విజయసాయిరెడ్డి సూచించినట్లు డాక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్సై ఖాదర్ బాషా

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడులో ఉప్పుతెర్ల వెంకయ్య అక్రమ మద్యం విక్రయిస్తుండగా మంగళవారం అదుపులోకి తీసుకుని 22 మద్యం సీసాలు(180 మి.లీ) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నవారి సమాచారం తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

స్పందన అర్జీలను జాగ్రత్తగా పరిశీలించాలి


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి, తహసీల్దార్

హనుమంతునిపాడు: స్పందనకు వచ్చిన ప్రతి అర్జీని జాగ్రత్తగా పరిశీలించి అర్జీదారునికి న్యాయం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎంఎల్ నరసింహం, తహసీల్దార్ ఎస్. హరిబాబు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలు అర్జీదారుని వద్దకు వెళ్లి జాగ్రత్తగా పరిశీలించి అర్జీదారుని సమస్యను పరిష్కరించాలని వీఆర్వోలకు, కార్యదర్శులకు సూచించారు. ఎస్సై జి. క్రిష్ణపావని, ఆర్ఐ లావణ్య, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా ఆదర్శ పాలన

- నాలుగేళ్లలో ప్రతి ఇంటికి లబ్ధి
- టీడీపీ హయాంలో దోచుకో..దాచుకో. పంచుకో తప్ప అభివృద్ధి శూన్యం
- చంద్రబాబు పాలనలో రాష్ట్రం అధోగతి పాలు
- ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: నాలుగేళ్ల పాలనలో దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి, సంక్షేమం మన రాష్ట్రంలోనే జరిగిందని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక వైఎస్సార్ భవన్‌లో భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలు అధోగతి పాలయ్యారని ఘాటుగా విమర్శించారు. టీడీపీ హయాంలో దోచుకో.. దాచుకో.. పంచుకో తప్ప ప్రజా సంక్షేమాన్ని గాలికివదిలారని తీవ్రంగా దుయ్యబట్టారు. పచ్చ చొక్కాల నేతలకు తప్ప సామాన్య మానవుడికి ఎటువంటి సంక్షేమ ఫలాలు దక్కలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా 28 సంక్షేమ పథకాలను అమలు చేసి, ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చరన్నారు. విద్య, వైద్య, వ్యవసాయం, ఉపాధి, సంక్షేమం అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ముందడగులో ఉందని వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ధర్మ పాలన చేస్తున్నారని కొనియాడారు.

పార్టీకి కార్యకర్తలే వెన్నముక

కార్యకర్తలే పార్టీకి వెన్నముక... మనమంతా ఒక కుటుంబం, మీకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. కుటుంబంలో చిన్న చిన్న సమస్యలు ఉంటాయన్నారు. ఏ నాయకుడైనా పార్టీ కార్యకర్త వద్దకు రావాల్సిందేనన్నారు. కనిగిరి చరిత్రలో కనివిని ఎరుగనిరీతిలో తనకు అత్యధిక మెజార్టీ వచ్చేందుకు కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తప్పక తగు సమయంలో న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. టీడీపీ నేతల దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. తొలుత పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్ రాజు, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, రామన తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ ఓకేరెడ్డి, ఏపీ ఎంసీ సభ్యులు డాక్టర్ పెరుగు మురళీ, కృష్ణా, తమ్మినేని సుజాత, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, యక్కంటి శ్రీనులు మాట్లాడారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, మాణిక్య రావు, కౌన్సిలర్లు పి.దీప, వేల్పుల వెంకటేశ్వర్లు, దాసరి మురళీ, తిరుపతయ్య, రామనబోయిన శ్రీను, జిలాని, జానీ, మీరావలి, పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు పోలు జయరాంరెడ్డి, కరీం బాషా, శీలం సుదర్శన్, భువనగిరి వెంకటయ్య, గజ్జల వెంకటరెడ్డి, సిరువ వెంకట గోవర్ధన్‌రెడ్డి, అట్లా రామచంద్రారెడ్డి, జి.బొర్రారెడ్డి, డాక్టర్ రసూల్, రాష్ట్ర డైరక్టర్ పెన్నా వెంకటేశ్వర్లు, మాదాల సుబ్బారావు, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, జి.ధనుంజయ్, పాలా సుబ్రహ్మణ్యం, నాగూర్ యాదవ్, నాగేంద్రారెడ్డి, మేకల మాల్యాద్రి, సీహెచ్ కిషోర్, శిగా కృష్ణారావు, కంటు గురవయ్య, మన్సూర్, భారతీ, మున్నా పాల్గొన్నారు.

అంకితభావంతో వైద్య సేవలందించండి

- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్


వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించే వైద్యులు అంకితభావంతో రోగులకు వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. ఆడుకుంటూ పాము కాటుకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పొన్నలూరు మండలం కల్లూరివారిపాలెంకు చెందిన చిన్నారి లక్ష్మీ చెందనను, తేలు కాటుకు గురై చికిత్స పొందుతున్న పీసీపల్లి మండలం పెద వరిమడుగుకు చెందిన కె.భాగ్యమ్మను పరామర్శించారు. తక్షణ చర్యగా పాము, తేలుకాటుకు గురైన బాధితులకు వైద్య సాయం ఎలా అందిస్తున్నారనేది అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ రోగుల పట్ల ఆప్యాయతగా పలకరించి, తక్షణ వైద్యం అందించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే సాధ్యమైనంత వరకు ప్రజలు వైద్య సేవలు పొందేలా వైద్యులు బాధ్యతగా, విధి నిర్వాహణ చేయాలన్నారు. ప్రభుత్వ దవాఖానలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సేవలపై విస్తృతంగా ప్రచారం చేసి, తగిన వైద్యం చేసినప్పుడే రోగుల సంఖ్య పెరుగుతుందని ఆస్పత్రి సూపరిండెంట్‌కు చెప్పారు. ఆస్పత్రిలో ఇన్‌పేషంట్లు అందుతున్న సేవల గురించి ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ సయ్యద్ అబ్దుల్ కలాం అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్‌లు పులి శాంతి గోవర్ధన్, మాణిక్యరావు, ఎంపీపీ డి ప్రకాశం, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రోత్సాహక నగదు అందజేత


విద్యార్థికి ప్రోత్సాహక నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

పామూరు: పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన మార్కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రాగిపిండి నవీన్‌కు ప్రోత్సాహక నగదు అందజేశారు. నవీన్ పరీక్షల్లో 563 మార్కులు సాధించాడు. మంగళవారం పాఠశాల హెచ్ఎం దేవిరెడ్డి రామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థి నివాసానికి వెళ్లి కనిగిరికి చెందిన ఉపాధ్యాయుడు మునగాల రమణారెడ్డి రూ.5 వేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు మరో రూ.20 వేలు అందజేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాగిపిండి బాల అంకిరెడ్డి, ఉపాధ్యాయులు మాధవశర్మ, రమేష్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొండపిలో మోస్తరు వర్షం


పెదకండ్లగుంట వద్ద కూలిన విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న ఏఈ కోటయ్య

కొండపి: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం బలమైన గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. గాలులకు పెదకండ్లగుంట ఎస్సీ కాలనీ సమీపంలో 11 కేవీ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో పెదకండ్లగుంట, జాళ్లపాలెంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. టంగుటూరు–కొండపి మధ్య 33 కేవీ విద్యుత్ తీగలు జమ్ములపాలెం గ్రామంలోని పొలాల్లో తెగిపడ్డాయి. దీంతో వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచి కొన్ని గంటలపాటు ప్రజలు ఇబ్బందిపడ్డారు. కొణిజేడు సబ్ స్టేషన్ నుంచి కొన్ని గ్రామాలకు, కందుకూరు సబ్ స్టేషన్ నుంచి మరికొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు విద్యుత్ శాఖ ఏఈ కోటయ్య తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన


పామూరులో కేక్‌కోస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పామూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా జనరంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి పార్టీ యూత్ మండల అధ్యక్షుడుయాదాల వెంకట సాయికిరణ్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ పాలన నాలుగు సంవత్సరాలు పూర్తయి ఐదవ ఏడాదితో అడుగిడిన సందర్భంగా ప్రత్యేక సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయంలో కేక్‌నుకోసి పంచిపెట్టి అనంతరం వైద్యశాలలో డాక్టర్లతో కలిసి రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీచేశారు.జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, వైస్ ఎంపీపీలు రషీద్, యేసురత్నం, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, కోఆప్షన్ నాయబ్ రసూల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, బి.మార్కు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణంతో గ్రామాలకు మహర్దశ


సీసీరోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పామూరు: మండలంలో ప్రాధాన్యతా క్రమంలో నిర్మిస్తున్న సీసీరోడ్లతో ఆయా గ్రామాలకు మహర్దశ పడుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇనిమెర్ల సచివాలయ పరిధిలోని ఇనిమెర్ల ఎస్సీకాలనీ, ఎస్టీకాలనీ, బీసీకాలనీల్లో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ఇచ్చిన హామీమేరకు రూ.20 లక్షల గ్రామ సచివాలయ నిధులతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణాన్ని మంగళవారం ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సర్పంచ్ సిద్ధమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి, బొమ్మన శ్రీనివాసులు, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, ఖాదర్‌బాషా, మూల కోటిరెడ్డి, కోటా వెంకట క్రిష్టారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు పొన్నలూరులో గడప గడపకు మన ప్రభుత్వం

పొన్నలూరు: పొన్నలూరు గ్రామంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొనాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సీఎస్‌పురం(పీసీపల్లి): ప్రజలు పర్యావరణ హిత జీవనశైలికి అలవాటు పడాలని మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్ అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ అనంత జీవకోటికి ప్రాణవాయువును అందిస్తున్న చెట్ల ను కొట్టి వేయడం వల్ల జీవకోటి జీవనం ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ప్రస్తుత వేసవి కాలంలో నీటిని పొదుపుగా వాడాలని చెప్పారు. ప్లాస్టిక్ వస్తువుల ఉపయోగం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నివారించాలని సూచించారు. పరిసరాలు, పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యంగా ఉంటామని, ప్రతి ఒక్కరూ తమ గృహపరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అలీమ్, బీట్ ఆఫీసర్లు పార్థసారధి, కేశవరావు, మృధుల భారతి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్వెస్టిగేషన్ అధికారులమంటూ హల్‌చల్

హనుమంతునిపాడు: బేస్తవారిపేటకు చెందిన మద్దిల వెంటరామిరెడ్డి తండ్రి వెంకటరెడ్డికి హనుమంతునిపాడు సచివాలయంలో డెత్ సర్టిఫికెట్ ఎలా ఇచ్చావంటూ ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇన్వెస్టిగేషన్ అధికారులమంటూ స్థానిక సచివాలయం వద్ద హల్‌చల్ చేశారు. వివరాల్లోకి వెళితే..బేస్తవారిపేటకు చెందిన మద్దిల వెంకటరామిరెడ్డి తండ్రి వెంటరెడ్డి కూలీ పనులకు వచ్చి చని పోయాడు. మరణించిన కుటుంబసభ్యులు ఆధారాలు తీసుకొని విచారించి మూడు నెలల క్రితం డెత్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఇద్దరు వ్యక్తులు పంచాయతీ కార్యదర్శి వీరబ్రహ్మాచారిని కలిసి ఏ ఆధారంతో సర్టిఫికెట్ ఇచ్చావు, మేం ఇన్వెస్టిగేషన్ అధికారులమంటూ భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి ఐడీ చూపించమని అడగ్గానే..సదరు వ్యక్తులు అక్కడ నుంచి జారుకున్నారు. ఈ విషయమై ఎస్సైను వివరణ కోరగా..దీనిపై సమాచారం లేదని, విచారిస్తామని తెలిపారు.

పొగాకు అత్యధిక ధర రూ.202

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం పొందూరు గ్రామానికి చెందిన రైతులు 926 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 909 కొనుగోలయ్యాయి. 17 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.202, కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.199.90 పలికింది

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం చినవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాల రైతులు 810 బేళ్లు తీసుకురాగా 758 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 41 బేళ్లు తిరస్కరించారు.

గాలివాన బీభత్సం


హాజీపురంలో విరిగి పడిన విద్యుత్ స్తంభాలు

హనుమంతునిపాడు: మండలంలో సోమవారం రాత్రి, మంగళవారం గాలివాన బీభత్సం సృష్టించింది. హనుమంతునిపాడు, మల్లవరం, పాతమల్లవరం, కూటాగుండ్ల, నరవగోపాలుపురం, దాసళ్లపల్లి, తురకపల్లి తదితర గ్రామాల్లో గాలివాన ఉరుములతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యాయి. మండలంలో పలు గ్రామాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. హాజీపురంలో ఏడు విద్యుత్ స్తంభాలు, ఒక విద్యుత్ వ్యవసాయ బోర్ల ట్రాన్స్‌ఫార్మర్ విరిగి కిందపడింది. గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పీసీపల్లి: పీసీపల్లిలో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఈ వర్షంతో దగ్గర లోని చిన్నపాటి కాలువలు, చెరువుల్లోకి నీరు వచ్చి చేరింది. ఎంతో కాలంగా వేసవితో విసిగిపోయి ప్రజలకు కాస్త ఊరటనిచ్చింది. వాతావరణ శాఖ 3 రోజుల పాటు వర్షం ఉంటుండడంతో దగ్గరలోని చెరువుల్లో భారీగా నీరు చేరే అవకాశమున్నట్లు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు రూ.17 కోట్లు నష్టపరిహారం విడుదల

- గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంతో భూములు కోల్పోయిన 214 మంది రైతులు
- రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ

మద్దిపాడు: భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసింది. బెంగళూరు–విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవేలో భాగంగా అనంతపురం జిల్లా కొడికొండ నుంచి బాపట్ల జిల్లాలోని మేదరమెట్ల వరకు 342 కి.మీ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూసేకరణ ఇప్పటికే పూర్తయింది. హైవే నిర్మాణానికిగాను మద్దిపూడి మండలంలో 214 మంది రైతులకు చెందిన 202 ఎకరాల పట్టా భూమి, 88 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. రైతులకు పరిహారం కింద ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. తొలివిడతగా పన్నూరు, మద్దిపూడి, కెల్లంపల్లి, కాకర్ల పంచాయతీ పరిధిలోని రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.17 కోట్లు జమ చేసినట్లు తహసీల్దార్ జగదీష్ రావు మంగళవారం తెలిపారు. కూచిపూడి, తిప్పల దేవిపల్లి, గార్లపేట పంచాయతీ పరిధిలోని రైతులకు రెండో విడతలో రూ.8 కోట్ల నగదు జమ అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

పోరాట యోధుడు పాండురంగారావు


పాండన్న స్థూపావిష్కరణ సభలో మాట్లాడుతున్న విప్లవ నాయకులు

సింగరాయకొండ: శ్రీకాకుళం సాయుధ పోరాట యోధుడుగా సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు టి పాండురంగారావు అలియాస్ పాండన్న ప్రత్యేక గుర్తింపు సాధించారని, ఆయన సేవలు మరువలేనివని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు కొనియాడారు. మండల కేంద్రంలోని పశువుల సంత సమీపంలో సోమవారం రాత్రి పాండన్న స్థూపావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. పోలీస్‌స్టేషన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి నూతనంగా నిర్మించిన పాండన్న స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు టాన్యా స్థూపాన్ని ఆవిష్కరించారు. పాండన్న జీవితచరిత్ర పుస్తకాన్ని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు టి.పాండురంగారావు ఆవిష్కరించారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్ సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. అరుణోదయ సాంస్కృతిక మండలి యువతీ, యువకులు ప్రదర్శించిన విప్లవ గీతాలు అందరినీ అలరించాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, సర్పంచ్, ప్రజావైద్యులు బి.శివరామిరెడ్డి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, బి.పద్మ, బి.రమాసుందరి, కె.నాంచార్లు, ఎస్.నాగరాజు, ఎల్.రాజశేఖర్, వై బాబూరావు, ఆర్.మోహన్, సీహెచ్ జాలన్న, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో ప్రజలకు సుపరిపాలన


టంగుటూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

టంగుటూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రజలకు సుపరిపాలన అందించారని రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ఆనం సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా.. కుల, మత, పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తుంటే చంద్రబాబు ఓర్వలేక పిచ్చి పట్టినట్లు మాట్లాడుతున్నారన్నారు. పేదలకు అమరావతిలో ఇకే సారి 50 వేల ఇంటి పట్టాలు అందిస్తే శ్మశానాలతో పోల్చడాన్ని ఖండించారు. జగనన్న ప్రవేశపెట్టిన పథకాలను చూసి కాపీ కొట్టి దొంగ మేనిఫెస్టో విడుదల చేసి మహిళలను, ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు సూదనగుంట వెంకటస్వామి, కొండపి ఏఎంసీ డైరెక్టర్లు కొమ్ము సురేంద్ర, టంగుటూరి రామకృష్ణ, సింగరాయకొండ జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాసు, అనంతవరం సర్పంచి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, మద్దిపూడి సురేష్, ఉప్పలపాటి సత్యనారాయణరాజు, లింగారెడ్డి సురేంద్రరెడ్డి, ఎస్‌కే యాసిన్, చింతం చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

టంగుటూరు: జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సంజీవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో 18 రెవెన్యూ గ్రామాలకుగాను 6 గ్రామాల్లో రీ సర్వే పూర్తికాగా, వీటిలో ఐదు గ్రామాల్లో హద్దురాళ్లను ఏర్పాటు చేశామన్నారు. అనంతవరం, వెలగపూడి, జయవరం గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కొణిజేడు గ్రామంలో సర్వే ప్రారంభించామని, రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కొణిజేడు గ్రామంలో 4200 మంది రైతులకు చెందిన 6,929 ఎకరాలను రీసర్వే చేయనున్నట్లు చెప్పారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం


ఆర్వోప్లాంట్ ను ప్రారంభిస్తున్న దాతలు

సీఎస్‌పురం(పీసీపల్లి): ఫ్లోరిన్ రహిత తాగునీరు అందించేందుకు దాతలు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించారు. మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పాలుగుళ్ల మోహన్‌రెడ్డి, కవిత దంపతులు ప్రజలకు ఉచితంగా తాగునీరు అందించేందుకు దాదాపు రూ.8 లక్షల ఖర్చుతో గ్రామంలో ఆర్వోప్లాంట్ ను ఏర్పాటు చేశారు. గ్రామ పెదకాపు ముత్యాల నర నారాయణరెడ్డి, అరుణ, వెంకటనారాయణరెడ్డి, సంధ్య దంపతులు ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతో ఆ స్థలంలో ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆర్వోప్లాంట్‌ను వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన వెంకటరెడ్డి, దాత పాలుగుళ్ల మోహన్‌రెడ్డి కవిత దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు భూమిరెడ్డి వెంకటరెడ్డి, పాలుగుళ్ల వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, ముత్యాల తిరుమలరెడ్డి, గంటా బ్రహ్మారెడ్డి, గూడపురెడ్డి రమణారెడ్డి, సమ్మన రమణయ్య, కందుల శ్రీనివాసులురెడ్డి, పోకల రమణారెడ్డి, భూమిరెడ్డి రామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ముత్యాల రవిచంద్ర పాల్గొన్నారు.

గేదెలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు

హనుమంతునిపాడు: నాలుగు పాడి గేదెలు గుర్తు తెలియని దొంగలు దొంగలించక పోయారని వేములపాడు గ్రామానికి చెందిన మాలపాటి రామిరెడ్డి పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. క్రిష్ణపావని తెలిపారు. ఈ నెల 26న పొలంలో కట్టేసి భోజనానికి వెళ్లి రాగా..గేదెలు కనిపించలేదని, వెతికినా కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com